# బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు సరికావు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ (బోథ్):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాక్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్లో చేసిన వ్యాఖ్యలను బోథ్ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు షేక్ షాకీర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటం, వేలాది మంది అమరుల త్యాగాల ఫలితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్–3 ప్రకారం పార్లమెంట్ ఆమోదంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని శత్రుదేశ విభజనతో పోల్చడం అత్యంత బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని అవమానించడం అంటే తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. ఎంపీ తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు పోలికలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ సహించరని స్పష్టం చేశారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** నియోజకవర్గంలోని వేంసూర్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మండలంలో మొక్కజొన్న పంట విస్తీర్ణం పెరిగి, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని తెలిపారు. అయితే సమీపంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పంటను విక్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా ఖర్చులు అధికంగా ఉండటంతో దూర ప్రాంతాలకు పంట తరలించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు.మద్దతు ధరకు పంటను అమ్ముకునే అవకాశం లేక నష్టపోతున్నామని, వెంటనే వేంసూర్ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఇప్పటికే పంట కోతలు ప్రారంభమయ్యాయని, ఆలస్యం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మధ్యవర్తుల జోక్యం తగ్గి రైతులకు న్యాయమైన ధర లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి రైతులకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులను కూడా రైతులు కోరుతున్నారు.

# పీఆర్సీ ప్రకటించి సమస్యలు పరిష్కరించాలి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీజీఈజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేంసూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండో పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రకటించి 51 శాతం ఫిట్మెంట్ అమలు చేయాలని కోరారు. అలాగే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని పేర్కొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కోలేటి నిర్మలకుమారి, గుత్తా చంద్రశేఖర్, బౌరోజు ఈశ్వరాచారి, రాజశేఖర్ రెడ్డి, సోమేశ్వరరావు, రామకృష్ణ, శ్రీకాంత్, సత్యనారాయణ, పుల్లారావు, కల్పన, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, కిషోరి, జమీలబేగం, మారేశ్వరరావు, దీన్ దయాల్, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ చొరవ.. గిరిజనుల కష్టాలకు మోక్షం

## రూ. 48 లక్షలతో కరకట్ట పనులు ప్రారంభం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** ఏళ్ల తరబడి వర్షం వస్తే చాలు వణికిపోయే ఆ గిరిజన గ్రామానికి ఎట్టకేలకు రక్షణ లభించింది. కుమ్రం భీం ప్రాజెక్టు కుడి కాలువ కోత కారణంగా కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్న మాణిక్ గూడ పీవీటీజీ గిరిజనుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. జిల్లా కలెక్టర్ కె. హరిత ప్రత్యేక చొరవతో మంజూరైన రూ. 48 లక్షల నిధులతో శుక్రవారం రక్షణ కరకట్ట నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి జిల్లా కలెక్టర్ భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. గతంలో కుమ్రం భీం ప్రాజెక్టు నిర్వాసితులైన పీవీటీజీ గిరిజనులకు మాణిక్గూడలో పునరావాసం కల్పించినప్పటికీ, గ్రామ సమీపం నుంచే వెళ్లే కాలువ వర్షాకాలంలో రహదారిని కోసివేస్తూ గ్రామానికి ముప్పుగా మారింది. ఫిబ్రవరి 24న దానా పూర్లో నిర్వహించిన భూ భారతి సదస్సులో గిరిజనులు తమ గోడును కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల విన్నపానికి తక్షణమే స్పందించిన కలెక్టర్ హరిత, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య తీవ్రతను గుర్తించారు.ఈ సమస్యను జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి, ప్రత్యేక రిక్వెస్ట్ లెటర్ ద్వారా ఇరిగేషన్ సెక్రటరీని కలిసి రూ. 48 లక్షల నిధులను మంజూరు చేయించారు. తమ విన్నపంపై మానవీయ కోణంలో స్పందించి, నిధులు మంజూరు చేయించడమే కాకుండా పనులను ప్రారంభించిన కలెక్టర్కు మాణిక్ గూడ గిరిజనులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కరకట్ట నిర్మాణంతో ఇకపై వర్షాకాలంలో తమకు వరద ముప్పు ఉండదని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





# వైద్య సేవల్లో అలసత్వం వద్దు

- సిబ్బందికి కలెక్టర్ హరిత హెచ్చరిక
- అడ పీ హెచ్ సి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్ :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ హరిత స్పష్టం చేశారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు రిజిస్టర్ను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ ఖచ్చితమైన సమయపాలన పాటించాలని, విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆరోగ్య కార్యకర్తలు నిరంతరం గ్రామాలను సందర్శించి వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవసరమైన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ఆసుపత్రిలోని మందుల నిల్వల గదిని తనిఖీ చేసిన ఆమె, అత్యవసర మందులతో పాటు సరిపడా ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తల వద్ద ఇవి ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పర్యవేక్షకులకు దిశానిర్దేశం చేశారు. సూపర్ వైజర్లు నిరంతరం సిబ్బంది పనితీరును గమనిస్తూ ఉండాలని కోరారు.అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ ముచ్చటించారు. వారికి అందుతున్న వైద్యం, సిబ్బంది ప్రవర్తన గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా మెలగాలని, రోగులకు భరోసా ఇచ్చేలా వ్యవహరించాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వారికి తక్షణ చికిత్స అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, ప్రత్యేక బెడ్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# కేజీబీవీలో హీమోఫిలియా దినోత్సవ అవగాహన సదస్సు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రపంచ హీమోఫిలియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వైద్యులు, పోలీస్ అధికారులు పాల్గొని విద్యార్థినులకు హీమోఫిలియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సద్దాం మాట్లాడుతూ హీమోఫిలియా అనేది రక్తం గడ్డకట్టే సామర్థ్యాన్ని ప్రభావితం చేసే జన్యుపరమైన లోపమని తెలిపారు. శరీరానికి గాయాలైనప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టకపోవడం ద్వారా కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్సై నీలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఆరోగ్యం పట్ల స్పృహ కలిగి ఉండాలని, ఇలాంటి అవగాహన సదస్సులు వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానంద రెడ్డి, హెచ్ఈఓ పవార్ రవీందర్, సబ్ యూనిట్ ఆఫీసర్ వేణు, హెల్త్ సూపర్వైజర్ సంతోష్, కేజీబీవీ హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రజిత, పీహెచ్సీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# తెలంగాణను పాకిస్థాన్తో పోలుస్తారా..?

- ఎంపీ తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దహనం





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నరేష్ జాదవ్ నాయకత్వంలో తెలంగాణ చౌక్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఎంపీ తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్ ఆమోదంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని దేశ విభజనతో ముడిపెట్టి శత్రుదేశమైన పాకిస్థాన్తో పోల్చడం అత్యంత దారుణమని మండిపడ్డారు. తెలంగాణ సాధన కోసం జరిగిన సుదీర్ఘ పోరాటాన్ని, వేలాది మంది అమరుల త్యాగాలను అవమానించే విధంగా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేసిన ఎంపీ తేజస్వి సూర్యను వెంటనే పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఆర్సీ ప్రకటించి బకాయిలు విడుదల చేయాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ (టీజీఈజేఏసీ) రాష్ట్ర స్థాయి పిలుపు మేరకు శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. మండల ఐక్యకా ర్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ ఎంఏ కలీమ్ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కొత్త పీఆర్సీ ప్రకటిం చాలని, గత కొంతకాలంగా పెండింగ్లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని కూడా త్వరితగతిన విడుదల చేయాలని విన్నవించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తహశీల్దార్ను కోరారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని తాండూర్ ఎంపీఓ అనిల్ కుమార్ పంచాయతీ కార్య దర్శులను కోరారు. శుక్రవారం యాప్ పరిశీలనలో భాగంగా రేచిని గ్రామ పంచాయతీని ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 15వ ఆర్థిక సంఘం నిధుల వ్యయాన్ని పరిశీ లించారు. గ్రామంలో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని, తాగునీటి సదుపా యాలు సక్రమంగా అందుబాటులో ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. అలాగే వీధిదీపాలు పనిచేస్తున్నాయా. లేదా తనిఖీ చేసి, పనిచేయని వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను పరిశుభ్రంగా ఉంచి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామంలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రేచిని గ్రామ సర్పంచ్ పోతురాజుల రాంబాయి, ఉప సర్పంచ్ భీమయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



# కల్లు దుకాణం ధ్వంసం చేసిన ఎక్సైజ్ అధికారులు

- కోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎక్సైజ్ శాఖ
- న్యాయం చేయాలని అంజా గౌడ్ డిమాండ్



**ఉద్యమ కెరటం, హత్నూర:** మండలంలోని బోర్పట్ల గ్రామంలో గీతా పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు అంజా గౌడ్ నిర్వహిస్తున్న కల్లు దుకాణాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం ప్రకారం దుకాణం కొనసాగుతున్నప్పటికీ అధికారులు వచ్చి దుకాణాన్ని కూల్చివేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంజా గౌడ్ మాట్లాడుతూ గ్రామ పెద్దలు, గ్రామస్తుల అంగీకారంతోనే తాను కల్లు దుకాణం ఏర్పాటు చేసుకున్నానని తెలిపారు. అయితే కొంత మంది సొసైటీ సభ్యులు వ్యక్తిగత కారణాలతో తప్పుడు ప్రచారం చేస్తూ ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని పట్టిం చుకోకుండా ఎక్సైజ్ అధికారులు దుకాణాన్ని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బోర్పట్ల గ్రామానికి వచ్చి గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గం, ప్రజల సమక్షంలో విషయాన్ని పరిశీలించి తకుకు న్యాయం చేసేలా చర్యలు తీసు కోవాలని కోరారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మాదారం ఏఎస్సై హుస్సేన్ అన్నారు. మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామంలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తెలిపారు. తమ వాహనానికి సంబంధించిన ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు వెంట ఉంచు కోవాలని సూచించారు. అలాగే మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. వారు ప్రమాదాలకు గురైతే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రవికుమార్, మాదారం త్రీ ఇంక్లైన్ సర్పంచ్ చందనాల రవికుమార్, పోలీస్ సిబ్బంది నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కవి మధు భావల్కర్కు డాక్టరేట్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రముఖ కవి, సాహితీవేత్త మధు భావల్కర్కు లూసియానా అమెరికన్ యూనివర్సిటీ (పూణే) గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. సాహిత్య, సామాజిక రంగాల్లో ఆయన చేసిన సుదీర్ఘ సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందజేస్తున్నట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. గత 55 సంవత్సరాలుగా కవితలు, కథలు, పాటల ద్వారా అక్షర సేవ చేస్తున్న మధు భావల్కర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బుద్ధుడు, మహాత్మా పూలే ఆశయాలను తన ప్రసంగాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తూ సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్నారు. ఆయన రచనలు ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాల్లో ప్రచురితమవ్వగా, ఆయన రాసిన 10 గ్రంథాలు విశేష ప్రజాదరణ పొందాయి. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఆయన నిరంతరం గళం వినిపి స్తున్నారు. ఈనెల 19న యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ను ఆయనకు ప్రదానం చేయనున్నారు. తన సాహిత్య సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణానికి ముందడుగు

### వాయుసేన సర్వే బృందం పర్యటన



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన విమానాశ్రయ నిర్మాణ దిశగా కీలక అడుగు పడింది. ఆదిలాబాద్కు మంజూరైన నూతన విమానాశ్రయ ప్రాంతాన్ని శుక్రవారం వాయుసేన (ఎయిర్ ఫోర్స్) సర్వే టీమ్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా విమానాశ్రయానికి కేటాయించిన భూములు, రన్వే సౌకర్యాలు, ఇతర సాంకేతిక అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరి శీలించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నరేష్ జాదవ్, డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాతలతో కలిసి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. విమానాశ్రయ ఏర్పాటు ద్వారా జిల్లా పారిశ్రామికంగా, రవాణా పరంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే వివరాలను అధికారులు ఉన్నత స్థాయికి నివేదించనున్నారు.

